ప్రజాశక్తి
మంగళవారం 6 జూన్ 2023
5
శ్రీకాకుళం

జీడి మద్దతు ధరకు దశల వారీ పోరాటం
వార్త... మెయిన్‌లో

అదపాక దళితులపై దాష్టీకం

- ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ మురళీకృష్ణకు ఫిర్యాదు
- 'స్పందన'కు 192 వినతులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

లావేరు మండలం అదపాక దళితులపై పోలీసులు దాష్టీకం ప్రదర్శించారు. అర్ధరాత్రి ఇళ్లలోకి చొరబడి వృద్ధులు, మహిళలను తీవ్రంగా కొట్టారు. దీనిపై గ్రామానికి చెందిన పలువురు దళితులు జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ మురళీకృష్ణకు ఫిర్యాదు చేశారు. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో లావేరు, చీపురుపల్లి పోలీసులు తమ ఇంటికి వచ్చి తన భర్త కుప్పిలి సూర్యనారాయణను ఈడ్చుకువెళ్లిపోతుండగా ఎందుకు తీసుకువెళు తున్నారంటూ అడిగిన తమను కులం పేరుతో దుర్భాషలాడుతూ పోలీసులు విచక్షణారహితంగా కొట్టారని, పోలీసులు కొట్టిన దెబ్బలను మహిళలు చూపించారు. ఇప్పటికీ తన భర్తను చీపురుపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఉంచారని భార్య సూరమ్మ కన్నీరుమున్నీరయింది. తమ గ్రామంలో ఏర్పాటు చేసిన వైశాఖి బయోమెరైన్ హేచరీ ఫ్యాక్టరీ వల్ల భూగర్భజలాలు, తాగునీరు కలుషితమవుతున్నాయని, మత్స్యసంపద నాశనమవుతుందంటూ ఎచ్చెర్ల మండలం డి.మత్స్యలేశం పంచాయతీ గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఐదు గ్రామాల ప్రజలకు ఆర్‌ఒ ప్లాంట్ల ద్వారా మంచినీటి సౌకర్యం కల్పించాలని కోరారు.

శ్రీకాకుళం మండలం సానివాడ రెవెన్యూ పరిధిలోని రాజావారి వీధిలో పంచిరెడ్డి జయ, సింహాచలం, పంచిరెడ్డి రమణ పంచాయతీలోని సర్వే నంబరు 96(1)లోని గ్రామకంఠం భూమిలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారంటూ గ్రామానికి చెందిన వండాన రామారావు ఫిర్యాదు చేశారు. ఆక్రమణదారులు, వారికి సహాయపడుతున్న గ్రామ, మండలస్థాయి అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

పలాస మండలం రామకృష్ణాపురంలో సర్వే నంబరు143 ఉజ్జుడుమెట్టలో 40 ఏళ్ల కిందట తాము రాబి సాంబశివరాం, అతని భార్య శ్యామలాదేవి వద్ద భూములు కొనుగోలు చేశామని, ఆ భూములకు ఆనుకుని ఉన్న ఉజ్జుడుమెట్టను రియల్ ఎస్టేట్ వ్యాపారులు చదును చేస్తున్నారని గ్రామానికి చెందిన పలువురు రైతులు ఫిర్యాదు చేశారు. తమ భూములను సర్వే చేసి 1బి అడంగల్ ఇవ్వాలని పలుమార్లు రెవెన్యూ, జిల్లా అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయిందన్నారు. వెంటనే వాటిని జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు.

పోలీసులు తమను కొట్టారని చెప్తున్న దళిత మహిళలు

మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఆలిండియా రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు, బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలంటూ స్త్రీ విముక్తి సంఘటన కార్యదర్శి తాండ్ర అరుణ వినతిపత్రం అందించారు.

శ్రీకాకుళం నగరంలోని స్థానిక కొన్నావీధిలోని మున్సిపల్ స్థలాన్ని సచివాలయ సిబ్బంది అండతో లొట్టి యోగేష్ అనే వ్యక్తిరిజర్వ్ స్థలంలో ఇంటిని నిర్మించుకుంటున్నారని స్థానిక మహిళలు కొందరు స్పందనలో ఫిర్యాదు చేశారు. గతంలో తాము అమ్మవారి కోసం చెట్టు వద్ద సిమెంట్ అరుగు నిర్మిస్తే మున్సిపల్ అధికారులు ప్రొక్లెయిన్‌తో తొలగించేశారని చెప్పారు. మున్సిపల్, సచివాలయ సిబ్బందికి తెలిసే ఇది జరుగుతోందన్నారు. ఆక్రమణలను తొలగించి అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

'స్పందన'కు 192 వినతులు

స్పందన కార్యక్రమానికి 192 వినతులు వచ్చాయి. ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ మురళీకృష్ణ వినతులను స్వీకరించారు. సమస్యల పరిష్కారంపై ఫిర్యాదుదారులు సంతృప్తి చెందారా? లేదా? అనే విషయాన్ని అధికారులు స్వయంగా ఫోన్ చేసి తెలుసుకోవాలన్నారు. స్పందన కార్యక్రమంలో స్వీకరించే ప్రతి దరఖాస్తునూ 24 గంటల్లో ఓపెన్ చేసి పరిష్కరించడమా?, తిరస్కరించడమా? అనే అంశాలపై వివరణ ఇవ్వాలని సూచించారు. తిరస్కరించిన పక్షంలో సరైన కారణాలు తెలపాలన్నారు. స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. నిర్ణీత కాల వ్యవధిలో అర్జీలకు పరిష్కారం చూపించాలని చెప్పారు. ఇన్‌ఛార్జి డిఆర్‌ఒతో పాటు ఉప కలెక్టర్ జయదేవి, ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, జిల్లా పరిషత్ సిఇఒ వెంకట్రామన్, డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్ ఫిర్యాదులను స్వీకరించారు.

విద్యుత్ వాహనాలు పరిశీలన

జెడ్‌పి కార్యాలయ ప్రాంగణంలో నెడ్‌క్యాప్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ఎలక్ట్రిక్ వాహనాల ప్రదర్శనను ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ మురళీకృష్ణ విద్యుత్ మోటారు బైకులు పరిశీలించి వాటి పనితీరు, ధరల వివరాలను తెలుసుకున్నారు.

ఎస్‌పికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు, రైతులు

సాగుదారులకు రక్షణ కల్పించాలి

ఎస్‌పికి సిపిఎం, రైతుల వినతి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

తరతరాలుగా నారాయణపురం భూములను సాగు చేసుకుంటున్న భూ సాగుదారులకు రియల్ ఎస్టేట్ వ్యాపారుల నుంచి రక్షణ కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు డిమాండ్ చేశారు. నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఎస్‌పి జి.ఆర్ రాధికకు వినతిపత్రం అందించారు. ఎచ్చెర్ల మండలం చిలకపాలెంకు ఆనించి ఉన్న నారాయణపురం భూములను తరతరాలుగా దళితులు, బిసిలు సాగు చేస్తూ పశువుల పాకలు వేసుకుని జీవనం సాగిస్తున్నారని చెప్పారు. రియల్ ఎస్టేట్ మాఫియా ఈనెల మూడో తేదీన రేగాన ఆదినారాయణ పశువుల పాకను బుల్డోజరుతో ధ్వంసం చేయడానికి ప్రయత్నించగా, అడ్డుకున్న రైతుపై దాడి చేశారని తెలిపారు. రైతుపై దౌర్జన్యం చేసిన పెత్తందారులకు మద్దతుగా పోలీసులు వచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ రికార్డుల్లో 171 ఎకరాల భూమి చిలకపాలెంకు చెందిన ఎస్‌సి, బిసి రైతుల సాగులోనే ఉన్నట్లు రెవెన్యూ అడంగల్‌లో 2005 వరకు ఉందని తెలిపారు.

సాగు హక్కులు కల్పించాలి

రియల్ ఎస్టేట్ వ్యాపారులు రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై అడంగల్ నుంచి రైతుల పేర్లను తొలగించి రికార్డులను తారుమారు చేసి తమ పేర్లతో తప్పుడు పాస్ పుస్తకాలు సృష్టించారని చెప్పారు. తరతరాలుగా రైతులు అనుభవిస్తున్న భూములను లాక్కోవడానికి తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారని ఆమె దృష్టికి తీసుకొచ్చారు. ప్రజలకు అండగా ఉండాల్సిన ప్రభుత్వ యంత్రాంగం దౌర్జన్యకారులకు కొమ్ము కాయడం సరికాదన్నారు. నారాయణపురం భూములు సాగు చేస్తున్న రైతులకు రక్షణ కల్పించి, సాగు హక్కులు కల్పించాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో నారాయణపురం భూ సాగుదారుల పోరాట కమిటీ నాయుకులు తోనంగి నందోడు, పి.మల్లేశ్వరరావు, కోరాడ అప్పన్న, జె.సీతారాం, ఆర్.మంగమ్మ, టి.అనురాధ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

తప్పటడుగులు వేస్తున్నారు

- సచివాలయ ఉద్యోగులకు ప్రభుత్వంపై ఎందుకు కోపం?
- రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి - ఆమదాలవలస

సచివాలయ ఉద్యోగులు తప్పటడుగులు వేస్తున్నారని రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. వైసిపి ప్రభుత్వం రెండు లక్షల సచివాలయ ఉద్యోగులను రూపాయి అవినీతి లేకుండా నియమించిందని చెప్పారు. ఈ ప్రభుత్వంపై సచివాలయ ఉద్యోగులకు కోపం ఎందుకని ప్రశ్నించారు. ప్రభుత్వంతో కలిసి ప్రజలకు సేవ చేయాలన్నారు. మున్సిపాల్టీ పరిధిలోని గేదెలవానిపేట కసింవలసలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం అవినీతి లేని పారదర్శక పాలనను అందిస్తోందన్నారు. గత ప్రభుత్వాలు మాటలు చెప్పడమే కానీ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చేవి కావని, వైసిపి ప్రభుత్వం 98 శాతానికి పైగా హామీలను నెరవేర్చిందన్నారు. అందుకే తామంతా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలో తిరగగలుగుతున్నామని తెలిపారు. గతంలో ప్రభుత్వ పథకాల కోసం జన్మభూమి కమిటీలు చుట్టూ తిరిగి లంచాలు ఇస్తే పథకాలు వచ్చేవని, నేడు ఆ పరిస్థితి లేకుంటే లబ్ధిదారుల ఇంటికే పథకాలు అందుతున్నాయన్నారు. వచ్చే ఏడాది మేతో ఈ ప్రభుత్వ పాలన ముగుస్తుందని, వచ్చే ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రాకపోతే ఇప్పుడు వస్తున్న పథకాలేవీ రావన్నారు. రకరకాల వాగ్దానాలతో చంద్రబాబు నాయుడు వస్తున్నారని, ఆయన మాయమాటలు నమ్మితే అధోగతి కాక తప్పదని హెచ్చరించారు. జగన్మోహన్ రెడ్డి ప్రజలకు డబ్బులు పంచేస్తూ రాష్ట్ర అప్పులను పెంచి ప్రజలను సోమరిపోతులను చేస్తున్నాడని గగ్గోలు పెట్టిన ఆ పెద్ద మనిషి, నేడు ఉచిత పథకాలను ప్రకటించారని ఎద్దేవా చేశారు. అనంతరం వాలంటీర్లను సత్కరించారు. కార్యక్రమంలో యువనేత ధర్మాన రామ్ మనోహర్ నాయుడు, మాజీ జెడ్‌పిటిసి చిట్టి జనర్ధానరావు, మాజీ ఎంపిపి అంబటి శ్రీనివాసరావు, బోర చిన్నంనాయుడు, సాధు కామేశ్వరరావు, దుంపల శ్యామ్, మున్సిపల్ కమిషనర్ ఎం.రవిసుధాకర్, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-1 పరీక్షలు పరిశీలన

శ్రీకాకుళం : నగరంలోని మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న గ్రూప్-1 పరీక్షల బందోబస్తును ఎస్‌పి జి.ఆర్ రాధిక సోమ వారం పరిశీలించారు. పరీక్షా కేంద్రం వద్ద బందోబస్తు విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ఎటువంటి అవాంతరాలకు తావు లేకుండా సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. పరీక్షా కేంద్రానికి అభ్యర్థులను తప్ప ఇతరులను అనుమతించరాదని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రంలోకి ఎటువంటి ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతించరాదని తెలిపారు.

అధికారుల నిర్లక్ష్యంతో కూలిన వంతెన

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం పట్టణంలో బాహుదా నదిపై రోడ్డు వంతెన కుప్పకూలడానికి అధికారుల నిర్లక్ష్యమే కారణమని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. కూలిన వంతెనను ఎమ్మెల్యే బెందాళం అశోక్‌తో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకవైపు పట్టణంలో గ్రామదేవత సంబరాల సమయంలో భారీ ట్రైలర్ వాహనం రావడం, భారీ వాహనాల రాకపోకలపై ఆంక్షలు ఉండే వంతెనపై వెళ్లడం అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తోందన్నారు. తాత్కాలిక వంతెన నిర్మాణానికి రూ.40 లక్షలు ఏమాత్రం సరిపోవని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు దక్కత డిల్లీరావు, సదానంద రౌలో తదితరులున్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి
- జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

ప్రజాశక్తి - శ్రీకాకుళం

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యాన స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని పలు శాఖల అధికారులు, ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలు, విద్యార్థులు సోమవారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఏడురోడ్ల కూడలి వద్ద ర్యాలీని జిల్లా అటవీశాఖ అధికారి నిషా కుమారి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ కాలుష్యపు కోరల నుంచి బయటపడేందుకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. పర్యావరణాన్ని మనం కాపాడితే, అది మనల్ని కాపాడుతుందన్నారు. ప్రకృతిలో సమతుల్యతను కాపాడుకోలేకపోతే రానున్న రోజుల్లో సమస్యలు తప్పవన్నారు. వాటిని అధిగమించాలంటే ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత చేపట్టాలన్నారు. జిల్లా అటవీ శాఖ అధికారి నిషా కుమారి మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు ప్లాస్టిక్ రహిత సమాజాన్ని అందించాలన్నారు. మానవాళి మనుగడకు మొక్కలు జీవనాధారమన్నారు. మొక్క నాటిన నుంచి సంరక్షణ బాధ్యత తీసుకోవాలన్నారు. జిల్లా ఇన్‌ఛార్జి రెవెన్యూ అధికారి మురళీకృష్ణ మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం, పారిశుధ్యంపై అవగాహన ఇంకా పెరగాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమాల్లో కాలుష్య నియంత్రణ మండలి ఇఇ ఎస్.శంకర్ నాయక్, నెడ్‌క్యాప్ ఎమ్‌డి సుబ్రమణ్యం, మెప్మా పీడీ కిరణ్ కుమార్, జిల్లా పర్యాటక అధికారి ఎన్.నారాయణరావు, జిల్లా పౌర సంబంధాల అధికారి కె.బాలమాన్ సింగ్, సెట్‌శ్రీ సిఇఒ ప్రసాదరావు, ఎన్‌వైకె సమన్వయకర్త ఉజ్వల్, జిల్లా మొదటి అదనపు జడ్జి కె.శ్రీదేవి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శారదాంబ, మొబైల్ కోర్టు మెజిస్ట్రేట్ సిహెచ్.శ్రీవిద్య, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎన్ని సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న నిషా కుమారి

జిల్లా అటవీశాఖ అధికారి కార్యాలయం వద్ద రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యాన రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. 35 మంది రక్తదానం చేశారు. అనంతరం మొక్కలు నాటి, పర్యావరణంపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి నిషా కుమారి, ఎసిఎఫ్ ఇ.హారిక, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, కె.దుర్గ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రైలు ప్రమాద మృతులకు సైకత నివాళి

ఒడిశాలోని బాలేశ్వర్‌లో సంభవించిన రైలు ప్రమాదంలో మృతి చెందిన వారికి నివాళ్లర్పిస్తూ సైకత శిల్పి గేదెల హరికృష్ణ సైకత శిల్పాన్ని చెక్కారు. మండలంలోని సంగమేశ్వర కొండ సమీపాన వేసిన సైకత శిల్పాన్ని చూసేందుకు వచ్చిన చుట్టుపక్కల గ్రామాల యువకులు కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు.

- ప్రజాశక్తి, ఆమదాలవలస

ఇంటింటికీ తాగునీరు లక్ష్యం

శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి - ఆమదాలవలస

జల్ జీవన్ మిషన్‌తో ఇంటింటికీ తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని శ్రీనివాసాచార్యులపేట పరిధిలోని ఈసర్లపేట, మండాదిలో రూ.31.90 లక్షలతో నిర్మించిన జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ మంచినీటి పథకాన్ని అందించే కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్ అవసరాలకు అనుకూలంగా తాగునీటిని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. స్వచ్ఛమైన తాగునీటిని ప్రతిఒక్కరికీ అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని చెప్పారు. మంచినీటి వినియోగంలో జాగ్రత్తలు పాటించకపోతే భవిష్యత్ తరాల మనుగడ ప్రశ్నార్థకమవుతుందన్నారు. మానవునికి ప్రతి అవసరంలోనూ నీటి వినియోగం అత్యంత అవసరమని, ఈ విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. భూగర్భ జలాల సద్వినియోగంపై గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి బెండి గోవిందరావు, పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, వైసిపి నాయకులు జి.ప్రభాకరరావు, గొంటి కృష్ణ, రెడ్డి నర్సింగరావు, ఎంపిడిఒ ఎస్.వాసుదేవరావు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి బిందెను మహిళకు అందిస్తున్న స్పీకర్ తమ్మినేని

వేసవి వినోదంలో గణితంలో గమ్మత్తులు

శ్రీకాకుళం : శ్రీకాకుళం నగరంలోని తుమ్మా వీధిలో క్రియేటివ్ చిల్డ్రన్ క్లబ్ నిర్వహిస్తున్న వేసవి వినోదంలో భాగంగా చిన్నారులకు గణితంలో గమ్మత్తులను సోమవారం నేర్పించారు. జెవివి బాధ్యులు వి.శ్రీనివాస కుమార్ మేజిక్ మేథ్స్ పిల్లలను బాగా ఆకట్టుకుంది. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మొక్కల పెంపకం ఆవశ్యకత, ఎలా పెంచాలనే విషయాలను ప్రముఖ రచయత చింతాడ రామారావు పిల్లలను అడిగారు. ప్రముఖ విద్యావేత్త కొత్తకోట అప్పారావు నేర్పిన ఆకులతో ఆకృతులను విద్యార్థులు ఆసక్తిగా చూశారు. ఉపాధ్యాయులు సిహెచ్.రామచంద్రరావు, పేడాడ వేదావతి పిల్లలకు దేశభక్తి గేయాలను నేర్పించారు. అనంతరం మెజీషియన్ ఉమామహేశ్వరరావు మేజిక్ చేసి చూపించారు. కార్యక్రమంలో క్రియేటివ్ క్లబ్ కన్వీనర్ చింతాడ కృష్ణారావు పాల్గొన్నారు.

అరుణ కుమారికి డాక్టరేట్

ఎచ్చెర్ల : శ్రీకాకుళం ట్రిపుల్ ఐటి కెమిస్ట్రీ విభాగంలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్న కొడవలి అరుణకుమారి ఆంధ్రా విశ్వవిద్యాలయం కెమిస్ట్రీ విభాగంలో పరిశోధన పూర్తి చేసి డాక్టరేట్ సాధించారు. ఆమెకు ట్రిపుల్ ఐటి డైరెక్టర్ పి.జగదీశ్వరరావు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఒఎస్‌డి సుధాకర్‌బాబు, పరిపాలన అధికారి ముని రామకృష్ణ, డీన్ మోహన్‌కృష్ణ సహచర అధ్యాపకులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తల కోసం
www.prajasakti.com
epaper.prajasakti.com

IN THE HONOURABLE COURT OF THE DISTRICT COMMISSION FORUM AT SRIKAKULAM
C.C. No. 12/2023

Between: Ravi D L P Christian,
--**Complainant**
And:
R-1. Sri Vaishnavi Townships (India) Pvt. Limited, Visakhapatnam represented by Sri. Vemulapalli Venkata Narasaiah, S/o Late Gopala Rao, Hindu, aged about 67 years, C/o D.No.1-69-8, M.V.P. Colony, Visakhapatnam district. R/o House No. 11-198, Ayyappa Nagar, Narasaraopeta Sivaru, Narasaraopeta, Guntur -522601. Aadhar No. 765658959444.
R-2. Sri Vaishnavi Townships (India) Pvt. Limited,Visakhapatnam represented by Smt.Nagothu Sabitha, W.o Nagothu Prakash Rao, R/o D.No. 5-1-16, Palnadu Road, Mother Theresa Hospital, Narasaraopeta, Guntur -522601, Aadhar No. 508156207904.
--**Respondent**
Please take this notice that the above matter is posted to **13/06/2023** for your appearance. You are hereby directed to appear before the Hon'ble Court on **13-6-2023 at 10.30 A.M.,** either in person or through an Advocate without fail and file your objections if any, otherwise the matter will be decided in your absence.

By Court Order

P.V. RAMANA DAYAL
Advocate, Srikakulam

శిరీషను అభినందిస్తున్న ప్రతినిధులు

జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు శిరీష

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఈనెల 8 నుంచి 11వ తేదీ వరకు ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో నిర్వహించనున్న 38వ జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు సీనియర్స్ విభాగంలో ముద్దాడ శిరీష ఎంపికైనట్లు తైక్వాండో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.భాస్కరరావు తెలిపారు. నగరంలోని ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో శిరీషను జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మెంటాడ సాంబమూర్తి, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు శాసపు జోగినాయుడు, ఇంటర్నేషనల్ వాకర్స్ క్లబ్ మాజీ అధ్యక్షులు గేదెల ఇందిరా ప్రసాద్ తదితరులు అభినందించారు.

ఇటీవల కాకినాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో శిరీష అండర్ 68 కేజీల విభాగంలో బంగారు పతకం కైవసం చేసుకుందని చెప్పారు. విజయంతో జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు.

పర్యావరణ పరిరక్షణతోనే మనుగడ

శ్రీకాకుళం : మొక్కలు నాటుతున్న సెట్‌శ్రీ సిఇఒ ప్రసాదరావు

పలాస : మొక్కలు నాటుతున్న డిఎస్‌పి నాగేశ్వర్‌రెడ్డి

సోంపేట : మానవహారం చేపడుతున్న పర్యావరణ పరిక్షణ సమితి సభ్యులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి, కాలుష్యాన్ని నియంత్రించడం, పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని డిఎంహెచ్‌ఒ బొడ్డేపల్లి మీనాక్షి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పుస్కరించుకుని లైఫ్‌స్టైల్ ఫర్ ఎన్విరాన్మెంట్‌లో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం వద్ద జండా ఊపి ర్యాలీ సోమవారం ప్రారంభించారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ప్రాంగణంలో మొక్కలు నాటారు. అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అనురాధ మాట్లాడుతూ మొక్కలు పెంచడం ద్వారా మనకు కావాల్సిన ఆక్సిజన్ లభిస్తుందన్నారు.

ప్లాస్టిక్ నిషేధం ద్వారా పూర్తిగా కాలుష్య నియంత్రణ సాధ్యపడుతుందని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ పథక సంచాలకులు డాక్టర్ విద్యాసాగర్ అన్నారు. నగరంలోని ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యాన మొక్కలు నాటారు. కార్యక్రమంలో స్టార్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు శాసపు జోగినాయుడు, వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్లు జి.ఇందిరాప్రసాద్, కూన వెంకటరమణ మూర్తి, గుడ్ల సత్యనారాయణ, డిప్యూటీ గవర్నర్ ఎస్.సంజీవరావు, ఇంటాక్ ప్రతినిధి వి.జగన్నాథనాయుడు, డాక్టర్ గంజి ఎజ్రా పాల్గొన్నారు.

శ్రీకాకుళం : పర్యావరణాన్ని పరిరక్షించడం ద్వారా వాతావరణ కాలుష్యాన్ని నిర్మూలించవచ్చునని సెట్‌శ్రీ సిఇఒ ప్రసాదరావు, నెహ్రూ యువ కేంద్రం కో-ఆర్డినేటర్ వెంకట్ ఉజ్వల్, జిల్లా క్రీడా ప్రాధికారిత సంస్థ చీఫ్ కోచ్ శ్రీధర్ అన్నారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా నగరంలోని స్విమ్మింగ్ పూల్ ఆవరణ లో లయన్స్ క్లబ్ ఆఫ్ శ్రీకాకుళం సెంట్రల్, లయన్స్ క్లబ్ ఆఫ్ శ్రీకాకుళం హర్షవల్లి ఆధ్వర్యాన సంస్థ అధ్యక్షులు హారిక ప్రసాద్ అధ్యక్షతన మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమం లో లయన్స్ క్లబ్ ఆఫ్ శ్రీకాకుళం సెంట్రల్ ఉపాధ్యక్షు లు పొన్నా డ రవికుమార్ హర్షవల్లి ట్రెజరర్ తర్లాడ అప్పలనాయుడు, కార్యదర్శి గేదెల గాంధీ, తూర్పుగోదావరి జిల్లా డిఎస్‌డిఒ శ్రీనివా సరావు, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షులు శాసపు జోగినా యుడు, స్విమ్మింగ్ కోచ్ కాంతారావు, సుభాన్ పాల్గొన్నారు.

టెక్కలి : పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రతిఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, దీనిని సామాజిక బాధ్యతగా స్వీకరించాలని సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం భాగంగా కార్యాలయ ఆవరణలో మెక్కలు నాటారు. అనంతరం పర్యావరణ సమతుల్యతను కాపాడాలని కోరుతూ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో కార్యాలయ ఎఒ కళ్యాణచక్రవర్తి, అటవీశాఖాధికారులు సంజీవరావు, డిఎల్‌పిఒ ఐ.వి.రమణ పాల్గొన్నారు. అలాగే స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో జూనియర్ సివిల్ జడ్జి తేజచక్రవర్తి మల్లా మెక్కలు నాటారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు దివ్వల వివేకానంద, ఎఎజిపి గురువెల్లి కృష్ణారావు, న్యాయవాదులు వైకుంఠరావు, పేడాడ ఆజాద్ పాల్గొన్నారు.

ఎచ్చెర్ల : ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం ఆవరణలో డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు మొక్కలు నాటారు. కార్యక్ర మంలో ప్రొఫెసర్ ఎల్.డి.సుధాకర్‌బాబు, పరిపాలన అధికారి ముని రామకృష్ణ, మోహన్ కృష్ణ చైదరి, ఫైనాన్స్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.అసిరినాయుడు. ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.ముకుందరావు, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ వి.సింహాచలం, జి.ఈశ్వరరావు, డాక్టర్ బి.శ్రీధర్, ఆర్.మల్లీశ్వరి పాల్గొన్నారు.

పలాస: చెట్లు శాతం తగ్గితే మానవాళికి నష్టం తప్పదని కాశీ బుగ్గ డిఎస్‌పి నాగేశ్వర్ రెడ్డి అన్నారు. కాశీబుగ్గ పోలీస్ డివిజన్ కేంద్రం ఆవరణలో గ్రీన్ ఆర్మీ ఆధ్వర్యాన మొక్కలు నాటారు. కార్యక్రమంలో కాశీబుగ్గ సిఐ శ్రీనివాసరావు, గ్రీన్ ఆర్మీ అధ్యక్షు లు బోనేల గోపాల్, మాజీ కౌన్సిలర్ రోణంకి శాంతి కుమారి, రోణంకి వెంకటరమణ, జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ బాడ వెంకట్ మోహన్, ఉపాధ్యాయులు బి.ఓంకార్ పాల్గొన్నారు.

బలగ : బలగ శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి పి.ఉగ్రసేను పిల్లలకు పర్యావరణ గురించి అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వాడకం పూర్తిగా తగ్గించాలని సూచించారు. కార్యక్రమంలో సహాయకులు కె.అనిత పాల్గొన్నారు.

పోలాకి: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత వహించాలి అని మండల పరిషత్ ప్రత్యేక సలహారులు ముద్దాడ భైరాగినాయిడు సూచించారు. వెలుగు కార్యాలయంలో ఎపిఎం జి.రాజారావు ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించారు. తహాశీల్దార్ కె.శ్రీరాములు, ఉషశ్రీ, సూపరింటెండెంట్ బి.సూర్యప్రకాష్, ఎపిఎం జి.రాజారావు, వైసిపి నాయకులు ఆర్.త్రినాథరావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : వెలుగు ఎపిఎం ప్రసాదరావు, ఎంపిడిఒ రామారావు ఆధ్వర్యాన మహిళా సంఘాలు వెలుగు కార్యలయం నుంచి నినాదాలతో అవగాహనా ర్యాలీ, ప్రతిజ్ఞ, మానవహారం నిర్వహించారు. అనంతరం జి.సిగడాం మండలంలోని అవయవ దానం చేసిన చంద్రకళ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో ఎఒ శ్రీదేవి, ఐసిడిఎస్ పిఒ నాగరాణి, ఎంపిపి ప్రతినిధి కె.మోహనరావు, సెల్లా దేవరాజు, బర్రి బలరామ్‌రెడ్డి పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : పర్యావరణ పరిరక్షణ మనందరరి బాధ్యతని వెలుగు ఎపిఎం జాంబవతి అన్నారు. పల్లిసారథి, వజ్రపు కొత్తూరు, గోవిందపురం, పాతటెక్కలి, అక్కుపల్లి గ్రామాల్లో మహిళలు ప్రతిజ్ఞ చేశారు. గ్రామ మహిళా సంఘాల అధ్యక్షులు, సిఎఫ్‌లు, స్వయంశక్తి సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి : పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని న్యాయవాది కె.మన్మథరావు, కె.అశోక్ అన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో న్యాయవాదులు, పోలీసులు మొక్కలు నాటారు.

ఆమదాలవలస : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని పెంచాల్సిన బాధ్యత ఉందని వైఎస్ఆర్ క్రాంతి పథం ఏరియా కో-ఆర్డినేటర్ పి.రవికుమార్ అన్నారు. పట్టణంలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో తమ్మినేని ధనలక్ష్మి అధ్యక్షతన ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పట్టణంలో ర్యాలీ తీసి ప్రతిజ్ఞ చేయించారు.ఎపిఎం పైడి కూర్మారావు, అకౌంటెంట్ కళ్యాణి, కోశాధికారి రేణుక, కార్యదర్శి వేనమ్మ పాల్గొన్నారు.

పలాస : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సామాజిక ఆస్పత్రి ఆవరణలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ డబ్బీరు భవానీశంకర్, సూపరింటెండెంట్ డాక్టర్ మేఘన మొక్కలను నాటారు. కార్యక్రమంలో డాక్టర్లు చిన్నంనాయుడు, రఘురాం, అశ్విని, అరుణకుమారి, కిరణ్, హెడ్‌నర్స్ ఇందుమతి, కౌన్సిలర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

పొందూరు : పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఎంతగానో దోహదపడతాయని తాడివలస ప్రధానోపాధ్యాయులు లఖినాన హేమనాచార్యులు అన్నారు. తాడివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నేషనల్ గ్రీన్‌కోర్ క్లస్టర్ కో-ఆర్డినేటర్ పూజారి హరిప్రసన్న ఆధ్వర్యాన మొక్కలను నాటారు. కార్యక్రమంలో పిఎంసి చైర్మన్ తమ్మినేని ప్రసాదరావు, సైన్స్ ఉపాధ్యాయులు రావాడ పాపారావు పాల్గొన్నారు.

సోంపేట : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పర్యావరణ పరిరక్షణ సమితి అధ్యక్షులు డాక్టర్ వై.కృష్ణమూర్తి ఆధ్వర్యాన ర్యాలీ చేపట్టి స్థానిక గాంధీ మండపం కూడలి వద్ద మానవహారం నిర్వహించారు. ప్రతిఒక్కరూ పర్యావరణ కాపాడాలంటూ నినాదాలు చేశారు.

జలుమూరు: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎఒ కె.సురేష్ పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా మహిళా సమాఖ్య సంఘ సభ్యులతో కలిసి అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వెలుగు ఎపిఎం పి.శ్రీనివాసరావు, సిసిలు పాల్గొన్నారు.

టెక్కలి : ర్యాలీలో పాల్గొన్న సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి

పోలాకి : ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

పొందూరు : మొక్కలు నాటుతున్న హెచ్‌ఎం హేమనాచార్యులు

ఇచ్ఛాపురం : ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

పథకాలను వివరిస్తున్న స్పీకర్ సీతారాం

ప్రజా సంక్షేమమే ధ్యేయం

శాసనసభ స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- పొందూరు

రాష్ట్ర ప్రజల సంక్షేమమే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి లక్ష్యమని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని లయిదాం పంచాయతీ కొల్లిపేటలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా చేసుకుని ముఖ్యమంత్రి పాలన సాగిస్తున్నారని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపడుతున్నదన్నారు. ఈ సందర్భంగా గడపగడపకు వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న లబ్ధిని చదివి వినిపించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, ఎఎంసి చైర్మన్ బాడాన సునీల్‌కుమార్, వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, ఎంపిపి ప్రతినిది కిల్లి నాగేశ్వరరావు, వైస్ ఎంపిపి ప్రతినిధి వండాన వెంకటరావు, సచివాలయం మండల కన్వీనర్ బాడాన కృష్ణారావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి

'నాడు-నేడు' పనులు వేగవంతం

ఇచ్ఛాపురం: ప్రభుత్వ పాఠశాలల్లో నాడు-నేడు ఫేజ్-2 భాగంగా చేపడుతున్న పనులు వేగవంతం చేయాలని చైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మి అధికారులకు సూచించారు. మున్సిపల్ కార్యలయంలో కమిషనర్ రమేష్, ఎంఇఒ అప్పారావుతో కలిసి 9 స్కూళ్లలో చేపడుతున్న నాడు-నేడు పనులపై ఉపాధ్యాయులు, సెక్రటరీలతో సోమవారం సమీక్షించారు. పనుల పురోగతిపై అడిగి తెలుసుకున్నారు. 75 శాతం వరకు పనులు పూర్తయ్యాయని అధికారులు ఆమెకు వివరించారు. ఆలస్యానికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. భవన నిర్మాణ కార్మికులు రోజూ రాకపోవడంతో ఆలస్యమవుతుందని వివరించారు. ఏజెన్సీ ద్వారా మరుగుదొడ్ల పరికరాలు, తలుపులు, కిటికీలు వంటి రాకపోవడంతో ఆలస్యానికి కారణమని చెప్పారు. ఈ విషయంపై ఎంఇఒ, కలెక్టర్ కూడా లేఖ రాశామని అన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మరో వారం రోజుల్లో పాఠశాలలు పున:ప్రారంభమవుతాయని, ఈలోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. సిఎం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పనుల్లో రాజీపడకుండా చేపట్టాలన్నారు.

విజృంభిస్తున్న డయేరియా

కోటబొమ్మాళి: మండలంలో పలు గ్రామాల్లో రెండు రోజులుగా డయేరియా విజృంభిస్తుంది. మసాహెబ్‌పేటలో అధిక సంఖ్యలో రోగులు ఉండగా, కొత్తపేట, మణినాగేశ్వరపురం, చుటుగుండం, అక్కయ్యవలసల్లో అంతంతమాత్రంగా ప్రభలింది. మాసాహెబ్‌పేటలో బి.పవన్, ఎస్.నాగమణి, బి.రామకృష్ణ, పి.దినేష్‌కుమార్, బి.తులసమ్మ, ఎం.నరసమ్మలతో పాటు మరో పదిమంది కోటబొమ్మాళి సామాజిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అలాగే కొత్తపేట నుంచి జె.సీతమ్మ, మణినాగేశ్వరపురం నుంచి జి.ఆదిలక్ష్మి, చుట్టుగుండం నుంచి ఎం.నాగ రాజు, అక్కయ్యవలస నుంచి ఐ.రామారావులూ చికిత్స పొందుతున్నారు. గత వారం రోజులుగా అడపదడప డయేరియా ప్రబలతుంది. వీరంతా కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉండడంతో వైద్య సిబ్బంది ఈ గ్రామాలవైపు కన్నెత్తి చూడకపోవడంతో కోటబొమ్మాళి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నామని రోగులు వాపోతున్నారు. ఎఎన్ఎంలు గ్రామాలకు వచ్చి పరిస్థితులు సమీక్షించేవారని, ప్రస్తుతం ఎఎన్ఎంలు సచివాలయాలకే పరిమితమవుతున్నారని విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి గ్రామాల్లో ప్రభుత్వ వైద్య సేవలు మెరుగుపర్చాలని సర్వత్రా కోరుతున్నారు.

చికిత్స పొందుతున్న డయేరియా రోగులు

ఎలుగు దాడి బాధితులను ఆదుకోవాలి

ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి మోహనరావు

ప్రజాశక్తి- పలాస

ఉద్దాన ప్రాంతంలో ఎలుగులు ఇష్టానుసారంగా సంచరిస్తున్నాయని, ఎలుగు దాడికి ఉద్దాన ప్రాంత ప్రజలు బలైపోతున్నారని, అందుకు అటవీశాఖ అధికారులు బాధ్యత వహించాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు అన్నారు. వజ్రపుకొత్తూరు మండలం అక్కుపల్లికు చెందిన జీడి రైతు సూరడ లోకనాథం సోమవారం ఎలుగు దాడిలో గాయపడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ప్రజా సంఘాలు, వామపక్ష నాయకులు సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వజ్రపుకొత్తూరు, మందస, పలాస మండలాల్లో ఎప్పటికప్పుడు ఎలుగులు జీడి తోటలు, గ్రామాల్లో చొరబడి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని అన్నారు. ఇటీవల వజ్రపుకొత్తూరు మండలానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఎలుగు దాడిలో మృతి చెందితే స్థానిక మంత్రి సీదిరి అప్పలరాజు, అటవీ శాఖ అధికారులు కంటితుడుపు చర్యగా ఎంతో కొంతమొత్తాన్ని అందించి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. ఉద్దాన ప్రాంతంలో ఎలుగులు గ్రామాలు, తోటల్లోకి రాకుండా నివారించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అటవీశాఖ అధికారులు, ప్రభుత్వం ఉద్దానం ప్రాంతంపై దృష్టి పెట్టి ఎలుగు దాడిలో గాయాలు, మృతి చెందకుండా నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎలుగు దాడిలో గాయాలపాలైన క్షతగాత్రులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఈయనతో పాటు అఖిల భారత కిసాన్ మహాసభ జిల్లా కన్వీనర్ మద్దిల రామారావు, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, జీడి రైతు సంఘం కన్వీనర్ తెప్పల అజయ్‌కుమార్, కుత్త వినోద్‌కుమార్, ప్రగతి శీల కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పుచ్చ దుర్యోధన, ఆదినారాయణ, రామకృష్ణ, తమ్మినాన భాస్కరరావు, కె.బాలాజీ, కె.హేమసూదన్ పాల్గొన్నారు.

పరామర్శిస్తున్న మోహనరావు, తదితరులు

ఎస్‌పి స్పందనకు 43 వినతులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

స్పందనలో వచ్చే ప్రతీ ఫిర్యాదునూ సత్వరమే పరిష్కరించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఎస్‌పి జి.ఆర్.రాధిక పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించి అదనపు ఎస్‌పిలు టి.పి.విఠలేశ్వర్, జె.తిపేస్వామిలతో కలిసి 43 మంది నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి ఫిర్యాదారులతో ముఖాముఖా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల అర్జీలను, సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తానని భరోసా ఇచ్చారు. టెలిఫోన్ ద్వారా సంబంధిత అధికారులకు ఫిర్యాదుదారుల వివరాలు, వారి సమస్యలను తెలియపరచి చట్ట పరిధిలో సత్వర న్యాయం అందించాలన్నారు. మోసపూరితమైనవి ఐదు, కుటుంబ తగాదాలకు సంబంధించి ఆరు, పాత ఫిర్యాదులు 8, ఆస్తి తగాదాలు 8, ఇతరములుకు సంబందించినవి 16 ఫిర్యాదులు వచ్చాయి.

ఫిర్యాదారులతో మాట్లాడుతున్న ఎస్‌పి రాధిక

హోంగార్డు కుటుంబానికి ఆర్థిక చేయూత

సహోద్యోగులు ఒక్క రోజు గౌరవ వేతనం చెక్కును ఇటీవల మృతి చెందిన హోంగార్డు వి.ప్రకాశరావు కుటుంబ సభ్యులకు ఎస్‌పి జి.ఆర్.రాధిక అందజేశారు. హోంగార్డులు సమకూర్చిన ఒక్క రోజు గౌరవ వేతనం నగదు రూ.4.23 లక్షల చెక్కును సోమవారం తన కార్యాలయంలో అందజేశారు. ఏ సహాయం కావాలన్నా పోలీస్‌శాఖ ముందుంటుందని భరోసానిచ్చారు. కార్యక్రమంలో ఆదనపు ఎస్‌పి జె.తిపేస్వామి, పరిపాలన అధికారి గోపీనాథ్, ఆర్ఐ ప్రదీప్ పాల్గొన్నారు.

విహారయాత్రకు ఆర్‌టిసి బస్సులు

టెక్కలి : టెక్కలి ఆర్‌టిసి డిపో ఆధ్వర్యాన విహార యాత్రకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని మేనేజర్ ఎన్.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10 నుంచి 17 వరకు బస్సు సర్వీస్‌లు నడపబడతాయని అన్నారు. భీమునిపట్నం, కైలాసగిరి, ఆరకు, పద్మాపురం గార్డెన్స్, గిరిజన మ్యూజియం, బొర్రాగుహలు, కాఫీయాత్ర వంటి ప్రదేశాలు చూపబడతాయని తెలిపారు. యాత్రికులకు భోజనం, ఉండేందుకు విడిది ఏర్పాటు చేశామన్నారు. ఒక్కో ప్రయాణికుని వద్ద నుంచి రూ.2,700 వసూళ్ల చేస్తున్నామని అన్నారు. ఆసక్తి గల వారు డిపోలో సంప్రదించాలని తెలిపారు.

రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

చెరువుల పరిశీలన

మెళియాపుట్టి: మండలంలో పెద్దలక్ష్మీపురం, ముకుందపురం, పరశరాంపురం గ్రామాల్లోని అమృత సరోవర్ అభివృద్ధి పనులను పలాస వ్యవసాయశాఖ జెడి లింగాల మధుబాబు, టెక్కలి ఎపిడి మురళీకృష్ణ సోమవారం పరిశీలించారు. పని ప్రదేశాల్లో బోర్డులను, చెరువు గట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పనుల్లో నాణ్యతకు పెద్దపీట వేయాలని, పారదర్శకంగా పనులు చేపట్టాలని సూచించారు. పనులు జరిగితే గ్రామస్తులకు ఉపయోగకరం అవుతుందన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ తిరుపతి పట్నాయక్, సర్పంచ్ బి.ఉదయ్, ఎపిఒ రవి, ఇసి ఆదినారాయణరెడ్డి, ఎన్ఆర్ఇజిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

అందిస్తున్న కలాం ఫౌండేషన్ సభ్యులు

రామారావుకు సాయం

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

కవిటి: బోన్ కేన్సరుతో బాధపడుతున్న మండలంలోని కొమ్ముపుట్టుగకు చెందిన తోట రామారావుకు మండలానికి చెందిన అబ్దుల్ కలాం ఫౌండేషన్ అండగా నిలిచింది. ఇటీవల 'ప్రజాశక్తి'లో వచ్చిన 'ఆ పాటకు ప్రాణం పోద్దాం' కథనానికి స్పందించి సోమవారం రామరావు కుటుంబాన్ని కలాం ఫౌండేషన్ సభ్యులు పరామర్శించారు. రామారావు వైద్యం కోసం తక్షణ సహాయంగా రూ.10 వేలు అందించారు. అనంతరం సభ్యులు మాట్లాడుతూ దయనీయ పరిస్థితిలో ఉన్న రామారావును దాతలు, స్వచ్ఛంద సంస్థలు ఉదారంగా ఆదుకోవాలని కోరారు. ఫౌండేషన్ సభ్యులు బి.శ్రీనివాస్, గోపి, సోమేశ్వరరావు, ఎన్.అనిల్‌సాయి, రాజు, బాబూరావు, బి.చలపతిరావు, జి.జానకిరావు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో పతకాల పంట

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

విజయనగరం జిల్లా కొత్తవలసలో ఇటీవల నిర్వహించిన ఇండియా తైక్వాండో ఆధ్వర్యాన థర్డ్ స్టేట్ ఛాంపియన్ షిప్ సబ్ జూనియర్ విభాగంలో ఇచ్ఛాపురానికి చెందిన క్రీడాకారులు అత్యంత ప్రతిభ కనబరిచి ఐదుగురు బంగారు పతకాలు సాధించి నట్లు కోచ్ దుర్గాప్రసాద్ తెలిపారు. దీంతోపాటు పలు పతకాలు సాధించిన క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. ఇందులో 24 కేజీ కేటగిరిలో పి.దమయంతి గోల్డ్ మెడల్, అండర్ 35 కేజీ కేటగిరిలో ఎ.కృతజ్ఞ సిల్వర్ మెడల్, 23 కేజీ కేటగిరిలో సిహెచ్.చందు సిల్వర్ మెడల్, క్యాడేట్ విభాగంలో సిహెచ్.గిరి గోల్డ్ మెడల్, ఎ.రేవంత్ గోల్డ్ మెడల్, సాడి జయరాం గోల్డ్ మెడల్, ఎన్.భగవాన్ సిల్వర్ మెడల్, ధర్మతేజ బ్రాంచ్ మెడల్ సాధించారని అన్నారు. గోల్డ్ మెడల్ సాధించిన ఐదుగురు వచ్చే నెలలో బెంగళూరులో జరగబోయే సబ్ జూనియర్, క్యాండిట్ నేషనల్‌లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ విజయం సాధించిన చిన్నారులకు సోమవారం స్థానిక తైక్వాండో క్లాసులో వార్డు కౌన్సిలర్లు పిలక విజయభాస్కర్, కాళ్ల దిలీప్, పిఇటి అసోసియేషన్ ప్రెసిడెంట్ బి.కృష్ణయ్య అభినందించారు.

పతకాలతో క్రీడాకారులు

కార్యకర్తలకు అండ

ప్రజాశక్తి- నౌపడ

ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటానని, ఎవరూ ఆధైర్యపడొద్దని నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి దువ్వాడ వాణి హామీనిచ్చారు. సంతబొమ్మాళి మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి నాయకులతో, కార్యకర్తలతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టెక్కలి ఎమ్మెల్యే సీటు ముఖ్యమంత్రికి కానుక అందించాలన్నారు. దానికి మీరంతా కలిసి రావాలని కోరారు. తనకు మండలంపై పూర్తిస్థాయి అవగాహన ఉందన్నారు. ప్రతి ఒక్కరి సమస్య విని అందరి సమక్షంలోనే దాన్ని పరిష్కరిస్తానని కార్యకర్తలకు హామీఇచ్చారు. పార్టీలకతీతంగా అందిస్తున్న సంక్షేమ పథకాలే ఎన్నికల్లో ప్రధాన పాత్ర పోషిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. నీతి నిజాయితీలతో పనిచేసి ప్రజలు మనల్ని

నౌపడ : మాట్లాడుతున్న వాణి

పొందుతామని తెలియజేశారు. టిడిపి చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాలన్నారు. గ్రూపు రాజకీయాలు ఏమి నియోజకవర్గంలో లేవని, అందరం ఒకటేనని చెప్పారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి పాల వసంతరెడ్డి, ఎంపిపి మేరుగు రాజేశ్వరి, పిఎసిఎస్ చైర్మన్ కెల్లి జగన్నాయకులు, సంపతిరావు, రాఘవరావు, మేరుగు అప్పారావు, నక్క భీమారావు, పొందల రామకృష్ణ, సుగ్గు రామిరెడ్డి, కోత సతీష్, ఎన్ని మన్మథరావు పాల్గొన్నారు.

సంక్షేమానికి ప్రాధాన్యం

టెక్కలి : ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, జెడ్‌పిటిసి దువ్వాడ వాణి అన్నారు. మండలంలోని అయోధ్యపురంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపిపి ఆట్ల సరోజనమ్మ, సర్పంచ్ బగాది హరి, గుజ్జు మోహన్‌రెడ్డి, రౌతు జయమోహన్, కె.కామేశ్వరరావు, మెర్రి శంకరరావు, పొందర శ్రీనివాసరావు, పోలాకి మోహనరావు, ఆట్ల రాహుల్, ఆట్ల రవి పాల్గొన్నారు.

ఎలుగు దాడిలో వ్యక్తికి గాయాలు

గాయపడిన లోకనాథం

వజ్రపుకొత్తూరు: ఉద్దానంలో ఎలుగు అలజడి సృష్టించింది. మండలంలోని అక్కుపల్లికి చెందిన సూరాడ లోకనాథంపై సోమవారం ఉదయం ఎలుగు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. జీడి తోటలో చివరిగా వచ్చిన పిక్కలు ఏరడానికి తోటకు వెళ్లాడు. అప్పటికే పొదలు మాటున ఉన్న ఎలుగు ఒక్కసారిగా మీద పడి దాడికి పాల్పడింది. కాలి పిక్క పూర్తిగా బయటకు వచ్చేసింది. తీవ్ర రక్తస్రావంతో కేకలు వేస్తూ గ్రామం వైపు పరుగులు తీశారు. గ్రామస్తులు అలజడితో ఎలుగు వెనుదిరిగింది. వెంటనే స్థానికలు పలాస ప్రభుత్వానికి చికిత్స నిమిత్తం తరలించారు. ఎలుగు సంచారంపై అటవీశాఖ అధికారులు దృష్టిసారించి జూకి తరలించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

బోల్తా పడిన కారు

కారు బోల్తా : ఇద్దరికి గాయాలు

సోంపేట : మండలంలోని బారువ - సోంపేట రహదారి లక్కవరం సమీపంలో ఆదివారం రాత్రి కారు బోల్తా పడి ఇద్దరికి గాయాలయ్యాయి. కుతుమకు చెందిన గుడియా కిరణ్, కె.నిరంజన్ ఇద్దరు కారులో మందస సంబరాలకు వెళ్లారు. తిరిగి వస్తుండగా కారు అదుపు తప్పి పక్క పొలాల్లో బోల్తా పడటంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది.

రాజ్యలక్ష్మి పరామర్శ

ఇచ్ఛాపురం : మున్సిపాలిటీలో 18వ వార్డు కౌన్సిలర్ చిడిపోతి జగన్నాయకులు తండ్రి చిడుపోతి జోగయ్య, 23వ వార్డు మాజీ కౌన్సిలర్ బాసి పార్వతీశం తల్లి బాసి దాలమ్మ ఇటీవల అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మి మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రేమ్‌కుమార్, పునపువ్వుల తేజ, నీలాపు ఢిల్లీ, ప్రకాశరావు పట్నాయక్ పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న గోవిందరావు

ప్రసాదరావు బాధ్యతల స్వీకరణ

బూర్జ: మండలంలో పెద్దపేట పంచాయతీ జగన్నాథ పురానికి చెందిన ఖండాపు గోవిందరావు ఇటీవల టిడ్కో డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు విజయవాడ టిడ్కో కార్యాలయంలో చైర్మన్ జె.ప్రసన్న కుమార్, ఆ సంస్థ మేనేజర్ సిహెచ్.శ్రీధర్ ఆధ్వర్యాన గోవిందరావు సోమవారం బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా సిఎం జగన్, శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాంకు అభినందనలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యత బాధ్యతగా చేపట్టి ప్రభుత్వానికి మంచి గుర్తింపు వచ్చే విధంగా కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు రాఘవరావు, కె.నాగేశ్వరి, పెద్దపేట ఉప సర్పంచ్ డి.వి.ఎ.నాయుడు, మండల డీలర్ల సంఘం అధ్యక్షులు పప్పల రామకృష్ణ, వార్డు మెంబరు జి.జగన్ పాల్గొన్నారు.

నౌపడ ఎస్ఐగా కిషోర్‌వర్మ

ప్రజాశక్తి- నౌపడ

నౌపడ ఎస్ఐగా పి.కిశోర్‌వర్మ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన పార్వతీపురం మన్యం జిల్లా దోనుబాయి పోలీస్ స్టేషన్ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎస్ఐ లావణ్య పార్వతీపురం మన్యం జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ మేరకు బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐకి సిబ్బంది పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శాంతి భద్రతలకు కాపాడేందుకు ప్రతిఒక్కరూ తమకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నౌపడ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

ఎంపీ పరామర్శ

సోంపేట : బ్రెయిన్ డెడ్ కు గురై అవయవ దానం చేసిన సోంపేటకు చెందిన మల్లారెడ్డి కిరణ్ చంద్ కుటుంబ సభ్యులను ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోకు సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా కిరణ్ చంద్ తల్లిదండ్రులు కళ్యాణి, మోహన్‌లతో మాట్లాడారు. మీరు తీసుకున్న నిర్ణయం అందరికీ ఆదర్శప్రాయమని కొనియాడారు. వీరితో పాటు సోంపేట, కంచిలి మండలాలకు చెందిన టిడిపి నాయకులు ఉన్నారు.

పత్రాన్ని అందుకుంటున్న ప్రిన్సిపాల్ గోవిందమ్మ

గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యం

టెక్కలి: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ధ్యేయంగా విద్యలో మార్పులు చేసుకోవాలని ఆంధ్రా యూనివర్సిటీ రీజనల్ కో-ఆర్డినేటర్ ఇనిస్టిట్యూట్ అధికారి డాక్టర్ పావని భీశెట్టి అభిప్రాయపడ్డారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. యుబిఐ ద్వారా నాక్ గుర్తింపుకు ఉపయోగపడుతుందన్నారు. విదివిధానాలు, భవిష్యత్ కార్యక్రమాలపై వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ, అధ్యాపకులు బేపల సతీష్‌కుమార్, కందిగోల్ల పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు పరిశీలన

పలాస: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, పారిశుధ్యం లోపిస్తే చర్యలు తీసుకుంటామని కమిషనర్ నాగేంద్ర కుమార్ సిబ్బందికి హెచ్చరించారు. మున్సిపాలిటీ పరిధిలో పల్లివీధి, తాటి వీధి ప్రాంతాల్లో పారిశుధ్య పనులను సోమవారం పరిశీలించారు. అలాగే నూతనంగా నిర్మిస్తున్న సిసి రోడ్ల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎప్పటికప్పుడు చెత్తా చెదారాలను తొలగించాలని సిబ్బందికి సూచించారు. సిసి రోడ్డు పనులు నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. ఆయనతో పాటు సచివాలయం ఉద్యోగులు ఉన్నారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు

ఇచ్ఛాపురం : రైతు భరోసా కేంద్రాల్లో రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎఒ శ్రీదేవి అన్నారు. మండలంలోని ఈదుపురం రైతు భరోసా కేంద్రంలో రైతలతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో సాగు లేక నిస్సారమైన భూములను పచ్చిరొట్ట సాగు ద్వారా మళ్లీ సారవంతం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సోనియా, భవానీశంకర్ పాల్గొన్నారు.

పద్మావతి కుటుంబాన్ని ఆదుకుంటాం

బూర్జ: మండలంలో లాభాంలో ఆదివారం పిడిగిపాటు గురై మృతి చెందిన నక్క పద్మావతి కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా ఆదుకుంటామని తహశీల్దార్ రమణారావు అన్నారు. ఈ మేరకు పద్మావతి కుటుంబ సభ్యులను సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న భీమా పథకంతో పాటు ప్రభుత్వం నుంచి వచ్చేవన్ని వర్తింపజేస్తామన్నారు. కార్యక్రమంలో విఆర్ఒ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శిస్తున్న తహశీల్దార్ రమణారావు

నవధాన్యాల సాగుపై అవగాహన

అవగాహన కల్పిస్తున్న హేమసుందర్

ప్రజాశక్తి- రణస్థలం

రైతులతో నవధాన్యాలు వేయించాలని శనార్త్ కొస్టల్ రీజినల్ ట్రైనింగ్ అధికారి హేమసుందర్ పిలుప నిచ్చారు. పొలంబడిలో భాగంగా డివిజన్ ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యాన రణస్థలంలో నవధాన్యాల సాగుపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎకరానికి 12 కిలోల నవధాన్యాలను వేయడం వల్ల నేలలో సేంద్రీయ కర్బనాన్ని పెంచి రసాయన ఎరువులను తగ్గించవచ్చునని అన్నారు. ప్రతి రైతూ వరి విత్తనాలు వేసే ముందు దీసామృతంతో విత్తన శుద్ధి చేసుకోవాలన్నారు. దీనిని నాటు కోవడం ద్వారా ఎటువంటి తెగుళ్లు ఆశించకుండా ఆరోగ్యకరమైన ఆరు మడులను తయారు చేసుకోవచ్చునని అన్నారు. తద్వారా రైతుకు పెట్టుబడి తగ్గించడంతోపాటు ఆరోగ్యకరమైన పంటను పండించవచ్చునని సూచించారు. అలాగే రణస్థలం రైతు భరోసా కేంద్రం విఎఎ సమక్షంలో హేమ సుందర్ రైతులకు నవధాన్యాలు విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఎం.సునీత, కంబపు కృష్ణ, కేలం లక్ష్మి, గెడ్డపు రమణమ్మ పాల్గొన్నారు.

ఆక్రమణలను తొలగించాలని వినతి

వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

టెక్కలి : పట్టణంలోని భవానీనగర్ వద్ద పట్టుశాలీ, బ్రాహ్మణ, సోండికుల, ముస్లిం సంక్షేమ సంఘాల భవనాల నిర్మాణాల దృష్ట్యా కేటాయించిన స్థలను పట్టణానికి చెందిన యర్ర భైరాగి ఆక్రమణ చేసి కంచె వేశారని, వాటిని తొలగించి భవన నిర్మాణాలకు అనుమతిని మంజూరు చేయాలని సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు సంఘ పెద్దలు గజవెల్లి నాగభూషణం, దుంపా శ్రీనివాస్, ఇఫ్తార్‌ఖాన్ తదితరులు సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డిని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో మంజూరైన స్థలాలను ఆక్రమించారని వివరించారు. అదే విధంగా సబ్‌కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో 37 వినతులందాయి. ఇవి ఆయా కార్యాలయ పరిధిలోని అధికారులకు పంపించారు.

వరహాల గెడ్డలో పూడికల తొలగింపు

పూడికలు తొలగిస్తున్న ప్రొక్లెయినర్

ప్రజాశక్తి- పలాస

మహేంద్రగిరి కొండలపైన కురిసే వర్షాల వల్ల వచ్చే వరద నీరు వరహాల గెడ్డ మీదుగా ప్రవహించి పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లోని వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని జనసేన నాయకుడు డాక్టర్ దుర్గారావు అన్నారు. మండలంలోని కంబిరిగాం వద్ద వరహాలు గెడ్డ రెండు పాయలుగా చీలి, ఒక పాయి వజ్రపుకొత్తూరు మండల గ్రామాలకు నీరు అందించే షట్టర్ దగ్గర సొంత ఖర్చులతో ప్రొక్లెయినర్‌తో పూడికలను సోమవారం తొలగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాలుగేళ్లగా వంశధార ఎడమ కాలువ చానల్, సహజ సిద్ధంగా ఉన్న గెడ్డలు, కాలువల్లో పూడికలు తొలగించలేదని అన్నారు. దీంతో సకాలంలో సాగునీరు అందరకపోవడంతో పంటలు పండక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు.

కిడ్నీ బాధితునికి 'అభయం'

టెక్కలి రూరల్: టెక్కలి రోటరీనగర్‌లో నివాసం ఉంటున్న ఎస్.కె.రిహాన్ కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న టెక్కలి అభయం యువజన సేవా సంఘం సభ్యులు వెంటనే స్పందించి ఈ సమాచారాన్ని గ్రూప్ సభ్యులకు తెలియజేశారు. చర్మ వ్యాధి నిపుణులు డాక్టర్ లింగాల రమేష్ రూ.పది వేలు, ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ సంభాన శ్రీనివాస్ రూ.3 వేలు అభయం సేవా సంఘానికి అందజేశారు. కొంత మంది మంది దాతల ద్వారా సేకరించిన విరాళను కలిపి రూ.40 వేలు రిహాన్ తండ్రి షేక్ అక్తర్‌కి అందజేసినట్లు అధ్యక్షులు దేవాది శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. కార్యక్రమంలో సెక్రెటరీ లాడి కామేశ్వరరావు, ఎన్.సింహాచలం, పిల్లల రమేష్, షణ్ముఖ మాస్టారు, అద్దాలు వీరభద్రచారి, దున్న శ్రీను, బొమ్మలి యోగేష్, బి.చంద్రకాంత్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

రైలు ప్రమాద బాధితులపై

సిఎం చొరవ హర్షణీయం

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఒడిశా రాష్ట్రంలోని బాలాసోర్ రైల్వే స్టేషన్ సమీపంలో జరిగిన కోరమండల్ రైలు ప్రమాదంలో రాష్ట్రానికి చెందిన బాధితులపై సిఎం జగన్మోహన్‌రెడ్డి చూపిన చొరవ హర్షణీయమని వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నియోజకవర్గ నాయకులు సువారి గాంధీ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రమాదంలో తీవ్ర గాయాల పాలైన వారు కోలుకోవడానికి వీలుగా ఏర్పాట్లు చేయడమే కాకుండా పరిహారాన్నీ ప్రకటించి ఆదుకున్నారని కొనియాడారు. మృతి చెందిన వారికి రూ.పది లక్షలు, గాయపడిన వారికి రూ.5 లక్షలు, స్వల్పంగా గాయపడిన వ్యక్తులకు రూ.లక్ష మంజూరు చేసి మానవతావాదిగా నిలిచారన్నారు. ప్రమాదంలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

సువ్వారి గాంధీ

అచ్చెన్నతో చీపుర్లపాడు నాయకులు

టిడిపి పూర్వ వైభవానికి కృషి

కోటబొమ్మాళి : రాష్ట్రంలో టిడిపి పూర్వ వైభవానికి కార్యకర్తలు కృషి చేయాలని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు పిలుపునిచ్చారు. మండంలోని నిమ్మాడ తన స్వగృహంలో అచ్చెన్నాయుడు ఉన్నారని తెలుసుకొని జిల్లా నలుమూలల ఉంచి టిడిపి నాయకులు సోమవారం అచ్చెన్నను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్‌మ్మోహన్‌రెడ్డి ప్రభుత్వం మరో ఆరో నెలల్లో ఎన్నికలకు సిద్ధమవుతారని, మనమంతా ఆ ఎన్నికల్లో వైసిపిని ఓడించాలని పిలుపునిచ్చారు. అలాగే టెక్కలి మండలం తోలుసూరిపల్లి, సంతబొమ్మాళి మండలం కోటపాడు, కాశీపురం, వడ్డీతాండ్ర, నందిగాం మండలం బడగాం, కాశీపురం, కోటబొమ్మాళి మండలం చీపుర్లపాడు పంచాయతీ మాజీ సర్పంచ్ గొండు లక్ష్మణరావు పలు సమస్యలు వివరించారు.

దీక్షలో పాల్గొన్న కంఠ వేణు

పారిశుధ్య కార్మికులకు జీతాలు పెంచాలి

ప్రజాశక్తి- పొందూరు

మేజర్ పంచాయతీ పొందూరులో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు జీతాలను తక్షణమే పెంచాలని ఆల్ ఇండియా దళిత రైట్స్ ఫోరం జిల్లా అధ్యక్షులు, ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ జిల్లా సభ్యులు డాక్టర్ కంఠ వేణు డిమాండ్ చేశారు. పొందూరు పంచాయతీ కార్యాలయం సమీపంలో ఐదు రోజులుగా పారిశుధ్య కార్మికులు చేపడుతున్న నిరాహర దీక్ష శిబిరాన్ని సోమవారం సందర్శించి తన సంఘీభావాన్ని తెలిపారు. పరిసరాలను నిత్యం శుభ్రం చేసి ప్రజల ఆరోగ్యాలను నిత్యం పరిరక్షించే పారిశుధ్య కార్మికుల న్యాయమైన డిమాండ్లను అధికారులు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో దళిత ఐక్యవేదిక నాయకులు కుమిలి రాజేష్, పడాల నాగరాజు, పడాల కనకరాజు, పడాల బుజ్జి, చింత కనకమ్మ, అవనాపు ఇందిర, పడాల కనకమ్మ, పడాల రాజేష్, అశోక్ పాల్గొన్నారు.

నందిగాం ఎంపిడిఒగా శివప్రసాద్

నందిగాం: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా జి.శివప్రసాద్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన విజయనగరం జిల్లా గుర్ల మండల పరిషత్ కార్యాలయంలో పరిపాలన అధికారిగా పనిచేసి ఉద్యోగోన్నతిపై నందిగాం ఎంపిడిఒగా బదిలీపై వచ్చారు. అలాగే మండల పరిషత్ పరిపాలన అధికారిగా ఎన్.ధనలక్ష్మి బాధ్యతలు చేపట్టారు. ఈమె కంచిలి మండలం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేసిన హెచ్.వి.రమణమూర్తి బదిలీపై టెక్కలి వెళ్లారు.

పోలాకి ఎంపిడిఒగా ఉషశ్రీ

పోలాకి: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా కె.ఉషశ్రీ సోమవారం తన కార్యాలయంలో ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల పరిధిలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతానికి చర్యలు చేపడతానని అన్నారు. ఆమెకు పరిపాలన అధికారి బి.సూర్య ప్రకాష్, సీనియర్ అసిస్టెంట్ జయరాజ్, జూనియర్ అసిస్టెంట్, సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఎంపిడిఒ ఉషశ్రీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిబ్బంది